క్లుప్తంగా

మెప్మా సిబ్బందితో పీడీ సమీక్ష



మాట్లాడుతున్న మెప్మా పీడీ మమత

కైలాస్‌నగర్: పీఎం విశ్వకర్మ దరఖాస్తుల పరిశీలనను త్వరితగతిన చేపట్టి లబ్ధిదారులకు ప్రయోజనం కలిగేలా చూడాలని మెప్మా పీడీ మమత అన్నారు. పీడీగా బాధ్యతలు స్వీకరించిన ఆమె మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌తో కలిసి మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పీఎం విశ్వకర్మ, డెంగీ జ్వరాల ఇంటింటి సర్వే, ముద్ర రుణాలు, స్వయం ఉపాధి రుణలక్ష్యాలు, ప్రగతి వంటి వాటిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెప్మా ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాభోగ్ దర్శన్



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకుడు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని శ్రీరాణి సతీజీ దేవాలయంలో పొలాల అమావాస్య పురస్కరించుకొని మహాభోగ్ దర్శన్ కార్యక్రమాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ కమిటీ ఆధ్వర్యంలో మహాహారతి, మహాభోగ్ దర్శన్, మహాప్రసాద్ కార్యక్రమాలను కనుల పండువగా నిర్వహించారు. అమ్మవారికి 56రకాల నైవేద్యాలు సమర్పించారు. మందిర్ ట్రస్ట్ కమిటీ సభ్యులు గణేశ్ లాల్ దేడియా, గోపీచంద్ దేడియా, సురేశ్ దేడియా, మోహన్‌లాల్ దేడియా, జగదీశ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

కొలాం ఆదివాసీలకు ఎరువులు పంపిణీ

ఇంద్రవెల్లి: మండలంలోని సట్వాజీగూడ ఫడ్ పౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని మర్కగూడ గ్రామానికి చెందిన గిరిజన మహిళా రైతులకు ఉచితంగా ఆర్గానిక్ ఎరువులు పంపిణీ చేశారు. ఫడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వరుణ్ ఫడ్ మాట్లాడుతూ కొలాం గిరిజన మహిళ రైతులను వ్యవసాయంలో ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇంద్రవెల్లి పటేల్ మారుతి డొంగ్రె, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, మర్కగూడ మాజీ సర్పంచ్ భీంరావ్, నాయకులు ఎండీ జహీర్, దిలీప్ మోరే, వికాష్‌ఫడ్ తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న వైద్యుడు చంద్రశేఖర్

ఆదిలాబాద్‌టౌన్: సీజనల్ వ్యాధులపై వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ హోమియో ఆస్పత్రి వైద్యుడు చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని కేఆర్‌కేలో గల వృద్ధాశ్రమంలో ఆయుష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వృద్ధులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజర్ ప్రీతం రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో బరువు, ఎత్తు కొలతలు

నార్నూర్: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో సామ్, మామ్ (బరువు, ఎత్తు) కొలతలు తీసుకోనున్నట్లు సీడీపీవో శారద అన్నారు. మంగళవారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఎత్తు, బరువు కొలతల కార్యక్రమాన్ని చేపట్టారు. హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్ చౌహాన్, సిబ్బంది గణేశ్ కుమారి, అంగన్‌వాడీ టీచర్ రాథోడ్ శ్యామక, ఆశ కార్యకర్త శ్రీలత, సంగీత, అనిత తదితరులు ఉన్నారు.

భారీ వర్షానికి కూలిన ఇళ్లు



వర్షానికి దెబ్బతిన్న ఇల్లు

బజార్‌హత్నూర్: మండలంలోని భూతాయి(బి) గ్రామంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మహోరి గంగుబాయి, గారులే విజయ్‌కు చెందిన ఇళ్లు కూలిపోయాయి. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శంకర్ మంగళవారం బాధితులకు ప్రభుత్వ పాఠశాలలో వసతితో భోజనాలు ఏర్పాటు చేశారు. వారికి నెలకు సరిపడా నిత్యావసర సరకులు అందజేశారు. కాగా బజార్‌హత్నూర్ గ్రామానికి చెందిన చిల్కూరి రుక్మకు చెందిన ఇంటి గోడ రాత్రి కురిసిన భారీ వర్షానికి కూలింది. డీటీ హరిలాల్, సినియర్ అసిస్టెంట్ విద్యాసాగర్ రెడ్డి, ఆర్ఐలు నూర్‌సింగ్, శ్యాంరెడ్డి, ఫడ్ మారుతి పాల్గొన్నారు.

అభివృద్ధికి దూరంగా గుబిడిపల్లి



గుబిడిపల్లి గ్రామం

- కనీస సౌకర్యాలు కరువు
- పట్టించుకోని పాలకులు
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు

తాంసి: భీంపూర్ మండలంలోని గుబిడిపల్లి గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. గ్రామంలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న గుబిడిపల్లి గ్రామంలో కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడుతూ గ్రామస్తులు జీవనం కొనసాగిస్తున్నారు. ఏళ్లుగా ప్రభుత్వాలు, పాలకులు మారిన తమ గ్రామం స్థితిగతులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల సీసీరోడ్ల పనులు చేపట్టగా.. పంచాయతీ కార్యాలయానికి సొంత భవనం లేక కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతోంది. గ్రామంలో 90 కుటుంబాలు, 360 పైగా జనాభా ఉన్న గుబిడిపల్లి గ్రామంపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రధాన సమస్యలివే..

గ్రామానికి ఉన్న మట్టిరోడ్డుకు మరమ్మతులు చేయకపోవడంతో పూర్తిగా గుంతలమయంగా మారింది. వాహనాలు, అంబులెన్స్, ఆటోలు రాలేని పరిస్థితి.



బురదమయంగా ప్రధాన రోడ్డు

- విద్యార్థులు పాఠశాలకు కాలినడకన వెళ్లాల్సిన దుస్థితి.
- గ్రామంలో 50కి పైగా కుటుంబాలు ఇళ్లు లేక పూరి గుడిసెల్లో నివసిస్తున్నారు. వారికి ఇళ్లు సైతం మంజూర్ చేయాలి. గ్రామానికి ప్రధానంగా సరైన రోడ్డు లేక వేరే గ్రామం నుంచి రేషన్ బియ్యం తెచ్చుకుంటున్నారు.
- సరైన రవాణా సౌకర్యం లేక సకాలంలో వైద్యం అందక ఇబ్బంది పడుతున్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చూపి గ్రామానికి రోడ్డు నిర్మించి, గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి



గ్రామానికి బీటీ రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్నేళ్లుగా ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. మట్టిరోడ్డు సరిగ్గా లేక మరమ్మతులు సైతం చేపట్టకపోవడంతో రాకపోకలకు ఇబ్బంది అవుతోంది. ఇప్పటికైనా అధికారులు రోడ్డు సౌకర్యం కల్పించాలి.

– నారాయణ, గుబిడిపల్లి

పట్టించుకోవడం లేదు



గ్రామంలో కనీస వసతులు కల్పించాలని కోరినా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రతీ నెల ప్రభుత్వం అందించే రేషన్ బియ్యం తీసుకురావడానికి అవస్థలు పడుతున్నాం. గతంలో ఉన్న పంచాయతీగా ఉన్న వడ్గాం గ్రామంలో నుంచి రేషన్ బియ్యం తెచ్చుకోవాల్సి వస్తోంది.

– కోడిసెల్ల గంగన్న, గుబిడిపల్లి

పారిశుధ్యం లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ఇంద్రవెల్లి: గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు నిర్వహించాలని డీఆర్‌డీవో సాయన్న అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యదర్శులతో మాట్లాడి గ్రామాల్లో జరుగుతున్న పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో భాస్కర్, ఎంపీవో సుమీర్‌హైమద్, ఏపీవో జాదవ్ శ్రీనివాస్ సిబ్బంది ఉన్నారు.

కల్వర్టు పరిశీలన..

భారీ వర్షం కారణంగా వరద నీటితో కోతకు గురైన కల్వర్టులు, దెబ్బతిన్న రోడ్లను బాగుచేసి ప్రజలకు తాత్కాలిక రవాణా సౌకర్యం కల్పించేందుకు కృషి చేయాలని అధికారులను డీఆర్‌డీవో సాయన్న ఆదేశించారు. మండలంలోని పాటగూడ వాగు వద్ద కోతకు గురైన కల్వర్టు, వరద నీటితో దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. ఎంపీవో సుమీర్‌హైమద్, పంచాయతీ కార్యదర్శి రవీందర్ తదితరులు ఉన్నారు.



కోతకు గురైన కల్వర్టును పరిశీలిస్తున్న సాయన్న

శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలి

బజార్‌హత్నూర్: మండలంలో కులమతాలకు అతీతంగా వినాయక చవితి, నవరాత్రుల పూజలను శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ రమేశ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో అన్ని గ్రామాల గణేశ్ మండపాల నిర్వాహకులు, యువకులు, నిరుద్యోగులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ గణేశ్ మండపాల వద్ద పేకాట, మట్కా, మద్యపానం చేయవద్దన్నారు. ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెక్యూరిటీగార్డు ఉద్యోగమేళాకు మండలం నుంచి 30 మంది యువకులను పంపించారు. ఎస్సైలు అప్పారావు, ప్రవీణ్, నర్సయ్య, ఉత్తం, రియాజ్, సాయన్న, మహబూబ్, గజ్జయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ రమేశ్

డిష్ కేబుళ్లను సరి చేసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని ఆయా విద్యుత్ స్తంభాలకు అమర్చిన కేబుల్ వైర్లను ఒక క్రమపద్ధతిలో సవరించుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్ అన్నారు. మంగళవారం కేబుల్ నెట్‌వర్క్ ఆపరేటింగ్ ఏజెన్సీలతో విద్యుత్ శాఖ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేబుళ్లకు సంబంధించిన స్టేప్‌ను గట్టిగా బిగించుకోవాలని సూచించారు. పట్టణంలో కేబుల్ పోల్‌కు బిగించినందుకు ఒక్కో పోల్‌కు రూ.20, గ్రామీణ ప్రాంతాల్లో రూ.15 చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. కేబుల్ ఆపరేటర్లు, విద్యుత్ శాఖ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఈ జేఆర్ చౌహాన్

హెచ్‌ఐవీ నిర్మూలనకు కృషి చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: హెచ్‌ఐవీ నిర్మూలనకు కృషి చేయాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి గజానంద్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని హమాలీవాడ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆశ, ఏఎన్ఎంలు, ఆరోగ్య కేంద్రం సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు హెచ్‌ఐవీపై అవగాహన కల్పించాలన్నారు. హెచ్‌ఐవీ సోకిన తల్లికి గర్భదశలోనే చికిత్స అందిస్తే పుట్టబోయే బిడ్డకు హెచ్‌ఐవీ సోకకుండా ఉంటుందన్నారు. జిల్లాలో ఈనెల 31 వరకు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులను కించపర్చేవిధంగా వ్యవహరించవద్దని సూచించారు. ప్రోగ్రాం అధికారి నాగరాజ్, మెడికల్ ఆఫీసర్ అవినాష్, కోఆర్డినేటర్ రజిత, సతీశ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న గజానంద్

మంత్రికి సన్మానం



పూలమొక్క అందజేస్తున్న శ్రీనివాస రెడ్డి

కైలాస్‌నగర్: జిల్లాలోని వరద ప్రాంతాలను పరిశీలించేందుకు జిల్లా కేంద్రానికి వచ్చిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం స్థానిక పెన్‌గంగా గెస్ట్‌హౌస్‌లో కలిసి శాలువాతో సత్కరించి పూలమొక్క అందజేశారు. స్థానిక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నాయకులు ప్రవీణ్ రెడ్డి, కృష్ణారెడ్డి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టిఎడ్ల పొలాల పండుగ



మట్టి ఎడ్ల పొలాల వేడుకల్లో భక్తులు

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలో రైతులు మంగళవారం మట్టి ఎడ్ల పొలాలను ఘనంగా నిర్వహించారు. బజార్‌హత్నూర్ గ్రామంలో అనాది కాలంగా కొన్ని రైతు కుటుంబాలు పొలాల పండగ మరుసటి రోజు మట్టి ఎడ్లను, కర్రతో చేసిన ఎడ్లతో పాటు చెక్కపై అరక, రైతు ప్రతిమలతో ఏర్పాటు చేసుకుని తలపై మోస్తు బ్యాండు మేళాలతో గ్రామం వీధుల గుండా ఊరేగింపుగా వచ్చి హనుమాన్ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

మృతిచెందిన పశువుల సమాచారం అందించాలి

నేరడిగొండ: మండలంలోని ఆయా గ్రామాల్లో భారీ వర్షాల కారణంగా మృతిచెందిన పశువుల వివరాలను స్థానిక పశువైద్యశాల సిబ్బందికి అందజేయాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ జీవన్ రాథోడ్ ఒక ప్రకటనలో తెలిపారు. నేరడిగొండ పశువైద్య అధికారి డాక్టర్ జీవన్ 8317599983, పి.నరేందర్ 9848489936, కె.శివప్రసాద్ 7893915765, వాంకిడి డాక్టర్ సుశీల్ కుమార్ 9502790709, అరుణ్ కుమార్ 9491158013, జంగు 8074429759, తర్నం ఎ.వెంకన్న 9490561478, ఎ.రాజన్న 9908817243లపై సంప్రదించాలని కోరారు.

ఖాళీ సీట్ల భర్తీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల (బోథ్), ఆదిలాబాద్‌లోని డిగ్రీ మొదటి సంవత్సరంలో 2024 -25 విద్యాసంవత్సరానికి మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసన్న ఒక ప్రకటనలో తెలిపారు. బీజెడ్‌సీ 7, బీఏ 3, బీఎస్సీ, ఫిజికల్ సైన్స్ 27, బీకాం 13 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 4, 5న ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో కళాశాలలో హాజరు కావాలన్నారు. వివరాలకు 98493 90495పై సంప్రదించాలని సూచించారు.

డిగ్రీలో చేరేందుకు స్పెషల్ డ్రైవ్

ఉట్నూర్‌రూరల్: ఇంటర్ పాస్ అయిన విద్యార్థులు డిగ్రీలో చేరేందుకు స్పెషల్ డ్రైవ్ కింద ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలని ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి 9వ తేదీ వరకు దోస్త్‌లో భాగంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం దోస్త్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈనెల 9లోగా దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం ఒక ప్రకటనలో తెలిపారు.

మూగజీవాల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఇంద్రవెల్లి: వానాకాలంలో మూగజీవాలకు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కిషన్ అన్నారు. మంగళవారం మండలంలోని అందునాయక్ తండాలో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పారుదు వ్యాధి టీకాల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. పశువులకు వ్యాధులు సోకితే వెంటనే పశు వైద్యాధికారులను సంప్రదించాలన్నారు. ఇంద్రవెల్లి, ముత్నూర్ పశువైద్యాధికారులు సుభాష్ రాథోడ్, సుదేష్, సిబ్బంది ఆత్రం రాందాస్, అనిల్, మీరాబాయి తదితరులు ఉన్నారు.



టీకా వేస్తున్న పశువైద్యాధికారులు

అధైర్యపడకండి అండగా ఉంటాం

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



రక్షిత కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఉట్నూర్‌రూరల్: అధైర్యపడవద్దని కుటుంబానికి అండగా ఉంటామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భరోసానిచ్చారు. మండలంలోని హస్నాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థిని రక్షిత ఇటీవల నిజామబాద్ జిల్లా పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్‌లో అనుమానస్పదంగా మృతిచెందగా, మంగళవారం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పరామర్శించారు. మృతికి గల వివరాలు అడిగితెలుసుకున్నారు. రక్షిత కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. మాజీ జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరాం జాదవ్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, మాజీ వైస్ఎంపీపీ సలీమొద్దిన్, నాయకులు ఉన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

నేరడిగొండ: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని తన స్వగ్రామం రాజురాలో జగదాంబదేవి సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో పూజలు నిర్వహించారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

తాంసి: గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వరదల కారణంగా పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరారు. మంగళవారం భీంపూర్ మండలంలోని అర్లి(టి) శివారులో పెన్‌గంగా వరద ప్రభావంతో దెబ్బతిన్న పంట చేలను పరిశీలించారు. ఈ క్రమంలో మండల వ్యవసాయాధికారి అందుబాటులో లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఏటా పెన్‌గంగ బ్యాక్ వాటర్ ద్వారా పంట నష్టం జరుగుతుందని, నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో గోపాలకృష్ణ రెడ్డి, ఏఈవో సాయిప్రసాద్, మండల నాయకులు నాగయ్య యాదవ్, కుమ్ర సుధాకర్, గడ్డం లస్మన్న, గోవర్ధన్ యాదవ్, తిరుమల్ గౌడ్, లస్మయ్య యాదవ్, రవుఫ్, సంతోష్, గంగయ్య, నితిన్, ఆఫ్రోజ్ అనిల్ తదితరులు ఉన్నారు.

‘జాతీయ విపత్తుగా ప్రకటించాలి’

జైనథ్: గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పెన్‌గంగ పరీవాహక ప్రాంతాల్లోని పంట చేలు వరద నీటితో మునిగిపోయాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే దీనిని జాతీయ విపత్తుగా ప్రకటించాలని మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్ చేశారు. మంగళవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి జైనథ్ మండలంలోని కరంజి, ఉమ్రి, బేల మండలంలోని సాంగిడి, భేదోడ, మాంగ్రూడ్ తదితర గ్రామాల్లో పర్యటించారు. రైతులు, నాయకులతో కలిసి నీట మునిగిన పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పంటలు మునిగిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న రైతులను పరామర్శించాల్సిన మంత్రి శ్రీధర్‌బాబు సీసీఐ పరిశ్రమను పరిశీలించడం వారి చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ప్రభుత్వం వెంటనే సర్వే నిర్వహించి రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు సర్పన్ లింగారెడ్డి, మార్శెట్టి గోవర్ధన్, మెట్టు ప్రహల్లాద్, యాసం నర్సింగ్ రావ్, రోకండ్ల రమేశ్, రైతులు ఉన్నారు.



కుళ్లిపోయిన పత్తి మొక్క చూపిస్తున్న రామన్న

నష్టపోయిన వారికి పరిహారం అందించాలి

బోథ్: ఇటీవల కురిసిన వర్షాల వల్ల ఇళ్లు కూలిన వారికి, పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని నక్కలవాడ, మర్లపెల్లి, బాబెర తాండ గ్రామాల్లో నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. దత్తు అనే వ్యక్తి ఇల్లు కూలగా కుటుంబానికి రూ. 5వేల ఆర్థికసాయం చేశారు. నాయకులు శ్రీధర్ రెడ్డి, బొడ్డు శ్రీనివాస్, దేవేందర్ రెడ్డి, బాబుసింగ్, కాశీనాథ్, సురేశ్, గ్రామస్తులు ఉన్నారు.

వరద నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు. మంగళవారం ధన్నూర్ గ్రామ సమీపంలో కోతకు గురైన రోడ్డును, వంతెనను పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చంటి, పీఏసీఎస్ డైరెక్టర్ రాజు యాదవ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వినయ్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇంద్రారెడ్డి, షేక్ అబూద్, నితిన్, షోయల్, ఉన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం చేస్తున్న మాజీ ఎంపీపీ శ్రీనివాస్

రేషన్ దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

నేరడిగొండ: మండలంలోని ఆయా గ్రామాల్లో గల రేషన్‌షాపులను టాస్క్‌ఫోర్స్ బృందం అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. బుగ్గారం(బి), తేజాపూర్, కుమారి, వడూర్ గ్రామాల్లో ఓఎస్‌డీ శ్రీధర్‌రెడ్డి, మేనేజర్ మల్లారెడ్డిలు తనిఖీలు నిర్వహించారు. రేషన్ సరుకుల శాంపిళ్లను సేకరించడంతో పాటు రికార్డులు పరిశీలించారు. రేషన్‌షాపుల ద్వారా లబ్ధిదారులకు సక్రమంగా రేషన్ సరుకులు అందుతున్నాయా.. లేదా అనే దానిపై ఆరా తీశారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వీరి వెంట ఏఎస్‌వోలు సుదర్శన్ రెడ్డి, రవీందర్ రాథోడ్, డీసీఎస్‌వో వాజిద్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది రామారావు, నారాయణ తదితరులు ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

ఏవోలను సన్మానించిన గ్రామస్తులు

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన రైతులు మంగళవారం మండల వ్యవసాయాధికారిని సన్మానించారు. పంచాయతీ కార్యాలయంలో నూతన మండల వ్యవసాయాధికారిగా వచ్చిన శ్రీనివాస్ రెడ్డి, మండల ఇన్‌చార్జి ఏవోగా ఉన్న రవీందర్‌ను సన్మానించారు. రైతులు శ్రీనివాస్, రమేశ్, గంగయ్య, మల్లేశ్ ఉన్నారు.

ఏఈఓలకు..

బోథ్: మండలంలోని సొనాల క్లస్టర్‌లో ఏఈవోగా పని చేసి బదిలీపై వెళ్తున్న వాజీద్‌ను, కొత్తగా ఇక్కడికి వచ్చిన ఉమను గ్రామస్తులు మంగళవారం శాలువాతో సత్కరించారు.



తాంసి: ఏవోలను సన్మానిస్తున్న రైతులు

ఆలయంలో ప్రత్యేక పూజలు

బోథ్: శ్రావణ మాసం ముగింపు సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ శివభక్త మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం రాత్రి నుంచి భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వేముల చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి మాసం అనిల్ కుమార్, భజన మండలి సభ్యులు రాజేశ్వర్, పురుషోత్తం, నర్సయ్య, గంగన్న, నారాయణ, లక్ష్మి, రాధ, నిఖిత, రాధ, సుష్మ, హనుమాండ్లు, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.



బోథ్: పూజలు నిర్వహిస్తున్న భక్తులు